జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com




* రిమ్స్‌లో అందుబాటులో ఉండని కొందరు అనస్థీషియా వైద్య నిపుణులు
* సర్జరీ పూర్తయ్యే వరకూ ఉండకుండా.. పీజీ స్టూడెంట్లకు బాధ్యతలపై విమర్శలు
* రోగుల బంధువుల నుంచి డబ్బులు వసూలు
* కాసులు ఇచ్చిన వారికే అనస్థీషియా వైద్య నిపుణుల సేవలు
* రిమ్స్‌లో జీతం.. కార్పొరేట్ ఆసుపత్రిలో సేవలు
* పరీక్షల్లో ఉత్తీర్ణత కల్పించేందుకు అనస్థీషియా పీజీ విద్యార్థుల నుంచి డబ్బుల డిమాండ్
* కొందరు అనస్థీషియా వైద్యుల తీరుపై సర్వత్రా ఆరోపణలు




# మత్తు వదలరా!

శ్రీకాకుళం, జూన్ 5 (వార్త): శ్రీకాకుళం సర్వజనీన ఆసుపత్రి (రిమ్స్)లో ప్రతిరోజూ ఆరు నుంచి ఎనిమిది వరకూ శస్త్ర చికిత్సలు జరుగుతుంటాయి. అనస్థీషియా వైద్య నిపుణులు.. ఈ సర్జరీ ప్రారంభం నుంచి చివరి వరకూ ఉండాలి. రోగికి సర్జరీ చేసే సమయంలో ఏమేరకు మత్తు మందు ఇవ్వాలన్నది వారిదే బాధ్యత. అయితే రిమ్స్‌లో మాత్రం దీనికి విరుద్ధంగా జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. రోగికి సర్జరీ చేసే ముందు ఎనస్థీషియా వైద్యులు కొందరు మత్తు మందు ఇచ్చి ఆ తర్వాత అక్కడ ఉండడం లేదని రోగుల బంధువులు చెబుతున్నారు. ఒక్కో సర్జరీ గంట నుంచి మూడు నాలుగు గంటలు పట్టే సమయం ఉంది. సర్జరీ చేసే సమయంలో రోగికి మెలకువ వస్తే ఆపరేషన్ చేసే వైద్యనిపుణులకు ఆటంకంగా ఉంటుంది. అయితే కొందరు మత్తు డాక్టర్లు మాత్రం వీటిని పట్టించుకోవడం లేదు. సర్జరీకి ముందు వచ్చి మందు వేసి, పీజీ స్టూడెంట్లను ఉంచి వెళ్లిపోతున్నారు. రిమ్స్‌లో పది మంది వరకూ మత్తు మందు ఇచ్చే వైద్యులు ఉన్నారు. వారిలో సగానికిపైగా డాక్టర్లు ఇక్కడ జీతం తీసుకుని ప్రైవేట్, కార్పొరేట్ సేవలు అందిస్తున్నారన్న గుసగుసలు కూడా ఉన్నాయి. వివిధ విభాగాల్లో శస్త్రచికిత్సలు చేయించుకుంటున్న కొందరు వ్యక్తుల నుంచి మత్తు మందు వైద్యులు కొందరు అనస్థీషియా సేవలను సకాలంలో, సజావుగా అందించేందుకు డబ్బు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. డబ్బు చెల్లించలేని లేదా ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు తెలిపే రోగులను కొన్నిసార్లు ఎక్కువసేపు వేచి ఉండేలా చేస్తున్నారు. దీనివల్ల కొన్ని శస్త్రచికిత్సలు వాయిదాపడుతున్నాయి. దీంతో రోగులతో పాటు వారి బంధువులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మత్తు మందు డాక్టర్లకు కాసులు ఇవ్వాల్సివస్తోంది. లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటున్న వారు కూడా సామాన్య, మధ్యతరగతి రోగుల నుంచి డబ్బులు దండుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అనస్థీషియా వైద్యులు తమ విధుల సమయం ముగియకముందే ఆపరేషన్ థియేటర్‌ను విడిచి వెళ్లి ప్రైవేట్ ప్రాక్టీస్‌కు హాజరవుతున్నారని, దీనివల్ల కొనసాగుతున్న శస్త్రచికిత్స సేవలకు అంతరాయం కలుగుతోందని రోగులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఆసుపత్రి అధికారుల దృష్టికి ఈవిషయాన్ని రోగుల బంధువులు తీసుకువెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. మత్తు మందు వైద్యుల నిర్వాకంపై పీజీ స్టూడెంట్లు కూడా నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమపైనే పూర్తి భారం వేస్తున్నారని, రోగికి ఏమైనా జరిగితే తమకు చెడ్డపేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, పరీక్షల్లో ఉత్తీర్ణత కల్పించేందుకు అనస్థీషియా పీజీ విద్యార్థుల నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్నారని కూడా కొందరు ఆరోపిస్తున్నారు. అనస్థీషియా విభాగాధిపతి దృష్టికి కొందరు మత్తు మందు వైద్యుల నిర్వాకంపై ఫిర్యాదులు వెళ్లినా ఆయన చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కొందరు రోగులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో పాటు చైర్మన్, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.




# కార్గో ఎయిర్‌పోర్టుకు.. మేం వ్యతిరేకం



* జిల్లా కలెక్టర్ ఎదుట ఎయిర్పోర్ట్ నిర్మాణాన్ని వ్యతిరేకించిన బిడిమి గ్రామస్తులు
* ముందుకు వచ్చిన కొందరు రైతులు
* కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణంతో అభివృద్ధి
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మందస, జూన్ 5(వార్త):విధ్వంసకర కార్గో ఎయిర్పోర్ట్‌కు భూములు ఇచ్చేది లేదని బిడిమి గ్రామస్తులు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్పష్టం చేశారు. మందస మండలంలోని రాంపురం పంచాయతీలో గల బిడిమి గ్రామంలో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషాతో పాటు అధికారులతో రైతులకు సమావేశం జరిగింది. కార్యక్రమంలో రైతులు మాట్లాడుతూ కార్గో ఎయిర్ పోర్టు ప్రతిపాదనను రద్దు చేయాలని బాధిత రైతులు ముక్తకంఠంతో అన్నారు. మరికొందరు రైతులు మాట్లాడుతూ భూమి ఇస్తే బాధిత రైతులకి ఎన్ని ఉద్యోగాలు ఎన్ని ఇస్తారు.. ఎకరాకి ఎంత డబ్బులు ఇస్తారో చెప్పాలన్నారు. అధికారికంగా ఏమీ చెప్పకుండా భూములు ఇవ్వండని ప్రభుత్వం అడగడం కరెక్ట్ కాదని వాపోయారు. మా బిడిమి గ్రామం నుంచి 130ఎకరాల భూమి పోతుందని, దాంట్లో సెంటు భూమి కూడా మిగలని రైతులు సుమారు 50 మంది ఉన్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఈ గ్రామాన్ని సందర్శించి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి స్వయంగా తమ అభ్యంతరాన్ని తెలియజేస్తూ కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణం వద్దని లేఖలను అందజేశారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుడు దున్న హరికృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తమ జీవితాలను విధ్వంసం చేసే కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణాన్ని చేపట్టకూడదని స్పష్టం చేశారు. మా పచ్చని ఉద్దానం భూములను ఏ ఇతర ప్రాంతం భూమితో పోల్చవద్దని మా భూమిపై కొబ్బరి జీడి, పనస, మునగ, మామిడి, బొప్పాయి, అరటి, మిరప, బెండ, వంకాయ, టమోటా తదితర ఉద్యాన వన పంటలు పండించికొని తరతరాలలుగా జీవించడం జరుగుతుందన్నారు. మా తాతలు పెంచిన కొబ్బరి జీడి పంటలతో ఇప్పటి వరకు జీవనం సాగించడం జరుగతోందన్నారు. ఈ పచ్చని ఉద్దానం ప్రాంతాన్ని పర్యావరణ పరిరక్షణ కోసం ఇలానే కొనసాగించాలని జిల్లా కలెక్టర్, సభకి హాజరైన స్థానిక శాసనసభ్యురాలు గౌతు శిరీష కోరారు. మా గ్రామం నుంచి భూమి ఇస్తామని చెప్పినారని, మొత్తం భూమి కలిపితే కనీసం 15ఎకరాలు కూడా కాదని జిల్లా కలెక్టర్ దృష్టిలో పెట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. అవకాశాలు వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి, ఉద్యోగాలు దొరుకుతాయన్నారు. ప్రస్తుతం భూములు ఉన్న ధర కన్నా మూడు రెట్లు ఎకరాకు సుమారు 19 లక్షల రూపాయల వరకు దొరుకుతుందన్నారు. ఎయిర్ పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత రైతులు జుత్తు కూర్మారావు, జుత్తు అమ్మినాయుడు, దున్న లక్ష్మోజీ, జుత్తు కృష్ణ మూర్తి, దున్న రాములమ్మ, తెప్పల గున్నయ్య, తిమ్మల హరికృష్ణ, బొడ్డు దుర్యోధన, చొక్కరి ధర్మారావు, కొండ రామారావు, ఇరోతు కృష్ణా రావు, జుత్తు నారాయణ, జుత్తు ధర్మరాజు, తెప్పల దానెమ్మ, జుత్తు కోటేష్, తిమ్మల జీవన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పలాస తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీదేవి



**పలాస, జూన్ 5(వార్త):** పలాస తహసీల్దార్‌గా బి.శ్రీదేవి పదవీ బాధ్యతలు శుక్రవారం చేపట్టారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలో ఆమె తహసీల్దార్ టి.కళ్యాణ్ చక్రవర్తి నుంచి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె శ్రీకాకుళంలోని డ్వామా కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా, గురువారం ఆమె పదోన్నతి పొందారు. శ్రీదేవి ప్రభుత్వ సేవల్లో నిబద్ధతతో ఈ పదోన్నతిని అందుకోవడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులు పొందుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, పలాస ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేయాలని కోరుకుంటూ సహచరులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు శుభాభినందనలు తెలిపారు.

## ఇన్ సర్వీస్ టీచర్స్‌కు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

**పలాస, జూన్ 5(వార్త):** ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయించే విధంగా చట్ట సవరణ చేయాలి లేదా ప్రత్యేక టెట్ నిర్వహించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఏపీఎస్టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పదోన్నతులు బదిలీలు ఇతర సర్వీస్ ప్రయోజనాలకు టెట్ తప్పనిసరి కావడంతో ఆఫ్లైన్లో సంవత్సరానికి రెండు సార్లు నిర్వహించాలని కోరారు. 50 సంవత్సరాలపైగా వయస్సు కలిగినటువంటి టీచర్లు ఆన్లైన్ పరీక్షల్లో సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందువలన వారిని ఆఫ్లైన్లో పరీక్షలు నిర్వహించే ఏర్పాట్లు చేయాలన్నారు . ఉత్తీర్ణతా శాతం అందరికీ ముప్పై ఐదు శాతం మార్కులకు తగ్గిస్తూ వారికి సంబంధించిన సబ్జెక్టులలోనే సామర్థ్యాలు పరీక్షించే విధంగా టెట్ పరీక్షలు నిర్వహించాలన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



**పలాస, జూన్ 5(వార్త):** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పలాస నియోజకవర్గంలో పర్యావరణ స్పృహను పెంపొందించేలా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటి చెప్పారు. పర్యావరణ రక్షించాలంటూ ర్యాలీ, మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఎమ్మెల్యే గౌతు శిరీష తన కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీని ప్రారంభించారు. నినాదాలు చేస్తూ సాగిన ఈ ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ముత్యాలమ్మ కోనేరు వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే, అక్కడ మొక్కలను నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతుశిరీష మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఉద్ఘాటించారు. కేవలం ప్రభుత్వ కార్యక్రమంగానే కాకుండా, ప్రతి ఒక్కరూ దీనిని ఒక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. "కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించడం కూడా అంతే ముఖ్యం," అని ఆమె సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, పచ్చని ప్రకృతిని అందించడానికి అందరూ కలిసి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, టిడిపి కార్యకర్తలు, పర్యావరణ ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన సేవలు అందించాలి



**పలాస, జూన్ 5(వార్త):** రోగులకు మెరుగైన సేవలు అందించాలని, ఉదయం 11 గంటల వరకు విధులకు కాదు కాకపోవడం ఏమిటి అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రశ్నించారు. శుక్రవారం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అని ఆమె స్వయంగా రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులు, ఆసుపత్రిలోని మౌలిక వసతులపై ఆరా తీశారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులలో ఉన్న పరిశుభ్రతను స్వయంగా పరిశీలించి, వైద్యులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని, రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు, ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రోగులు, వారి సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని, వైద్యులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పేద రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, అత్యవసర వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు కూన మోహన్ రావు, కూటమి నాయకులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**మందస, జూన్ 4(వార్త):** మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీలో గల రాధాకృష్ణపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి తెలిపారు. 5వ తరగతిలో 58, 6వ తరగతి 47, 7వ తరగతి 32, 8వ తరగతి 29, 9వ తరగతి 33, ఇంటర్ ఫస్టియర్ లో 36సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరిలలో మాత్రమే ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థినిలు ఈ నెల 8వ తేదీన సోమవారం పాఠశాలలో హాజరుకావాలని కోరారు. ఐదవ తరగతి, ఇంటర్ విద్యార్థినిలకు ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు, 6 నుంచి 9తరగతి విద్యార్థినిలకు మధ్యాహ్నం 2గంటల నుండి 4గంటల వరకు అడ్మిషన్ల ప్రక్రియ, కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందన్నారు. గురుకులంలో చేరగోరే విద్యార్థినిలు తమ సర్టిఫికెట్లతో గురుకులానికి హాజరు కావాలని ప్రిన్సిపల్ లక్ష్మి కోరారు.

## ముఖ్యమంత్రిని కలిసిన మూగ వ్యక్తికి ఆర్థిక సహాయం

**పలాస, జూన్ 5(వార్త):** ఇటీవల జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని, మూగ వ్యక్తి సాగర్ మహారాణా కలిసి తన ఇబ్బందులను వివరించారు. ఆయన పరిస్థితిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, వెంటనే ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రభుత్వం తరపున మంజూరైన రూ.2 లక్షల చెక్కును సాగర్, ఆయన కుటుంబ సభ్యులకు శుక్రవారం తన కార్యాలయంలో అందజేశారు. కష్టకాలంలో తమను ఆదుకుని, ఇచ్చిన మాట ప్రకారం సహాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, పర్యవేక్షించిన ఎమ్మెల్యే గౌతు శిరీషకి సాగర్ కుటుంబ సభ్యులు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం సామాన్యుల సమస్యలపై ఇలా తక్షణమే స్పందించి, ఆదుకోవడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు, సాగర్ కుటుంబ సభ్యులు తదితరులు హాజరయ్యారు.



# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

**- ప్రజా విజ్ఞాన వేదిక, గో గ్రీన్ సంస్థ పిలుపు**

**- బిన్నళమదనాపురంలో**

**మొక్కలు నాటిన ప్రతినిధులు**



**మందస, జూన్ 5(వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మందస మండలంలోని బిన్నళమదనాపురం గ్రామంలో ప్రజావిజ్ఞాన వేదిక, గో గ్రీన్ సంస్థల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావిజ్ఞాన వేదిక కన్వీనర్ మార్పు జగన్మోహనరావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో పచ్చని చెట్లు ముఖ్య భూమిక పోషిస్తాయని అన్నారు. ప్రతీ ఒక్కరూ ఒక మొక్క నాటి, గ్లోబల్ వార్మింగ్(భూతాపం) నుండి ఈ ప్రపంచాన్ని కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. గో గ్రీన్ సంస్థ సభ్యులు, మందస మాజీ ఉప సర్పంచ్ పురుషోత్తంబెహరా మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలనే చైతన్యం ప్రస్తుతం ప్రజలలో పెరుగుతోందని పేర్కొన్నారు. పాలకవర్గాలు ప్రజల చైతన్యానికి అనుగుణంగా పర్యావరణాన్ని పరిరక్షించడంలో వెనుక పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా కానుగ, కదంబ, అశోక, రావి, బాదం తదితర సుమారు 50మొక్కలను కన్వీనర్ జగన్మోహనరావు గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలను ఈ దిశగా చైతన్యపరుస్తూ జగన్మోహనరావు చేస్తున్న కృషిని పంచాయితీ సెక్రటరీ సురేష్ కుమార్ సాహు, పిరియా వెంకటరమణ అభినందించారు. టెక్కలి ఐతం కాలేజీ ప్రొఫెసర్ మార్పు చైతన్య కుమార్, గొలుసు మురళీకృష్ణలు సంయుక్తంగా శివాలయం వద్ద కానుగ మొక్కను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోమటిగుండం చెరువు గట్టుపైన, శివాలయం వద్ద నాటిన రావి మొక్కల రక్షణ కోసం గో గ్రీన్ సంస్థ చైర్మన్ పట్నాల మోహనరావుఆచారి, సభ్యులు మార్పు జగన్మోహనరావుల దాతృత్వంతో ఐరన్ ట్రీగార్డులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పనులకు వచ్చిన కూలీలతో పాటు రచయిత, గో గ్రీన్ మందస సభ్యుడు మామిడి కోదండరావు, దుప్పట్ల రాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పిల్లల సమగ్ర అభివృద్ధి.. రాష్ట్ర భవిష్యత్‌కు పునాది




**-నవచేతన కార్యక్రమం ప్రారంభం**

**- మందస సీడీపీఓ పెద్దింటి అరుణ**

**మందస, జూన్ 5(వార్త):** పిల్లల సమగ్ర అభివృద్ధి.. రాష్ట్ర భవిష్యత్తుకు పునాది అని ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు అధికారి పెద్దింటి అరుణ అన్నారు. మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నవచేతన కార్యక్రమాన్ని సీడీపీఓ పి.అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ప్రతీ పిల్లవాడి సమగ్ర అభివృద్ధి రాష్ట్ర భవిష్యత్తుకు పునాది అనే దృక్పథంతో ముఖ్యమంత్రి బాల్యారంభ సంరక్షణను ప్రభుత్వ ప్రాధాన్యతా అంశంగా గుర్తించారన్నారు. దీనిలో భాగంగా నవచేతన అనేది కార్యక్రమం 0 నుండి 6సంవత్సరాల పిల్లల అభివృద్ధిని ప్రారంభ దశలోనే అంచనా వేయడానికి రూపొందించిన మొబైల్ ఆధారిత డిజిటల్ అభివృద్ధి స్క్రీనింగ్ కార్యక్రమమే నవచేతన అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేయబడుతున్న ఈ కార్యక్రమం అంగన్‌వాడీ కార్యకర్తలకు శాస్త్రీయ, ప్రమాణీకృత స్క్రీనింగ్ సాధనాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమం ద్వారా ప్రతీ పిల్లవాడి అభివృద్ధి పురోగతిని క్రమబద్ధంగా పరిశీలించి, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన పిల్లలను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చున్నారు. నవచేతన యాప్ ద్వారా పిల్లల అభివృద్ధిని కింది ఐదు ప్రధాన విభాగాలలో అంచనా వేస్తారని, స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి, జ్ఞానాత్మక అభివృద్ధి, సామాజిక -- భావోద్వేగ అభివృద్ధి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సంతోషి, పీహెచ్ఎన్ పి.పెంటమ్మ, హెచ్ వీ టీవీ భారతి, ఏఎన్ఎం వై.నిర్మల , సుపరువైజర్లు సీహెచ్.వి.రామలక్ష్మి, పి.జయలక్ష్మీ, జె.లక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలాస రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**- రైల్వే జీఎం ఆదేశం**

**- పలాస రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు**



**పలాస, జూన్ 5(వార్త):** పలాస రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మధుర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన పలాస రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అమృత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన, నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పలాస రైల్వే స్టేషన్‌ను సందర్శించిన సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మధుర్ స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అమృత్ స్టేషన్ పథకం కింద చేపడుతున్న నిర్మాణాల పురోగతిని సమీక్షించి, పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, టికెట్ బుకింగ్ కౌంటర్, రైల్వే ఇంజనీరింగ్ విభాగం, రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ, రన్నింగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. ప్రయాణికుల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను సూచించారు. ముఖ్యంగా వేసవి, వర్షాకాలాల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద తగిన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. రైల్వే రైల్వే స్టేషన్‌లో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలపై కూడా సమీక్ష నిర్వహించారు. అమృత్ స్టేషన్ పథకం ద్వారా పలాస రైల్వే స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పనుల నాణ్యతతో పాటు వేగంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పలాస ఇండస్ట్రియల్ ఏరియా పరిశ్రమల యజమానులు జియంతో కలిసి వినతి పత్రం అందజేశారు. జీడి పరిశ్రమ యజమానులు తమ ఉత్పత్తులను ప్రత్యేకంగా రవాణా చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీలలో రైల్వే శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్, ఆపరేషన్స్ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటుదాం..రండి.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**పలాస, జూన్ 5(వార్త):**మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని పర్యావరణ ప్రేమి కులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలాస మండలం బ్రాహ్మంతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యూపీ స్కూల్, గ్రామ సచివాలయం పరిధిలో గ్రీన్ ఆర్మీ వారి ఆధ్వర్యంలో చెర్రీ, బాదం, కదంబ, సపోటా, నేరేడు, నీడనిచ్చే మొక్కలను శుక్రవారం నాటారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్ మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం ముఖ్య ఉద్దేశం పర్యావరణ సమస్యలు, సవాళ్లు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్లోబల్ వార్మింగ్‌తో ఓజోన్ పొర దెబ్బతిని పర్యావరణం పాడవుతుందని, భూగోళంపై సమస్త ప్రాణకోటి మనుగడకు ఆరోగ్యవంతమైన పర్యావరణం అవసరం ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణకై బాధ్యత తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ నాయుడు, ఏపీ ఎన్జీవోస్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, జిల్లాఎస్సీ ఎస్టీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ సభ్యులు వి.యాదగిరి, పిఎస్ డైరెక్టర్ రఘుపాత్రుని సుదర్శన్ రావు, పలాస యూనిట్ కో కన్వీనర్ ఆళ్ల.కృష్ణారావు, హై స్కూల్ హెచ్ఎం తారకేశ్వర పండ, ఎస్వీ రమణ, ఎస్ఎంసి చైర్మన్ తామాడ మోహన్రావు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ యాదవ రాజు, ఇరిగేషన్ అధికారి పొట్నూరి. శ్రీనివాసరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఆప్పన మధుబాబు, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాసరావు, ముఖ్య నాయకులు ఆళ్ల సోమేశ్వరరావు, శాసనపురి వెంకటరావు, ఆళ్ల.కృష్ణారావు అల్లాడి కృష్ణారావు, బండి రమేష్, పొట్నూరి.మురళి, గ్రీన్ ఆర్మీ సభ్యులునూకల.హేమసుందర్, లక్ష్మీనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ

# వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

**- పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు**

**ఎల్ఎన్ పేట, జూన్5 (వార్త):** ఖరీఫ్ సీజన్లో వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఎల్ఎన్ పేటలో శుక్రవారం రైతులకు ఎమ్మెల్యే విత్తనాలను అందజేశారు.రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వ్యవసాయాధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రశ్నించినందుకే మర్డర్ కేసు పెట్టారు

**- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు**




**పలాస, జూన్ 5 (వార్త):** "ఇవి అక్రమ వసూళ్లు కాదు... అక్క వసూళ్లు" నెలకు కోటి రూపాయలకుపైగా ప్రజల జేబుల నుంచి దోచుకుంటున్నారు ప్రశ్నించినందుకే నాపై మర్డర్ కేసు పెట్టారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆందోళన రక్తం చేశారు. పలాస నియోజకవర్గంలో మద్యం దుకాణాలు, బెల్ట్ షాపుల ద్వారా జరుగుతున్న అదనపు వసూళ్లపై మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పలాస-కాశీబుగ్గలో నిర్వహించిన "వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇవి సాధారణ అక్రమ వసూళ్లు కాదని, "అక్క వసూళ్లు" అని ఎద్దేవా చేశారు. పలాస నియోజకవర్గంలోని 24 మద్యం దుకాణాల్లో ప్రతిరోజూ సుమారు 550 కేసుల మద్యం, 350 కేసుల బీర్ విక్రయాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద రోజుకు 30 వేలకుపైగా బాటిళ్లు అమ్ముడవుతున్నాయని, ప్రతి బాటిల్పై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచే వినిపిస్తున్నాయని తెలిపారు. కనీసం రూ.10 చొప్పున లెక్కించినా రోజుకు సుమారు రూ.3 లక్షల మేర ప్రజల నుంచి అదనంగా వసూలవుతోందని, నెలకు రూ.90 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ప్రజల కష్టార్జిత ధనం దోచుకుంటున్న పరిస్థితి ఉందని ఆరోపించారు. ప్రజల చెమటోడ్చి సంపాదించిన డబ్బును ఈ విధంగా దోచుకోవడం దారుణమన్నారు. పలాస నియోజకవర్గ ప్రజలు తమ ఎమ్మెల్యేను "విజిటింగ్ ఎమ్మెల్యే"గా అభివర్ణిస్తున్నారని, నెలలో ఎక్కువ రోజులు విశాఖపట్నంలోనే ఉంటూ, నెలకోసారి పలాసకు వచ్చి ఈ వసూళ్ల డబ్బు సేకరించుకుని తిరిగి వెళ్లిపోతున్నారనే విమర్శలు ప్రజల నుంచే వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అదనపు వసూళ్ల అంశంపై గతంలో కూడా తాను శ్రీనివాస లాడ్జి వద్ద ధర్నా నిర్వహించి, ఆర్డీఓ కార్యాలయానికి వినతిపత్రం సమర్పించానని గుర్తు చేశారు. ప్రజల తరఫున ఈ వసూళ్ల గురించి ప్రశ్నించినందుకే తనపై మర్డర్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. అనేక ప్రజా సమస్యలపై ఆందోళనలు చేసినప్పటికీ, ఈ మద్యం వసూళ్ల అంశాన్ని లేవనెత్తినప్పుడు మాత్రమే తీవ్రమైన కేసులు పెట్టడం వెనుక ఉన్న కారణాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. నిజంగా ఈ వసూళ్లు జరగడం లేదంటే స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు బహిరంగంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల జేబులను ఖాళీ చేస్తూ సాగుతున్న ఈ వ్యవస్థపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం సాగుతుందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్పష్టం చేశారు.

# హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు అవసరం



**జలుమూరు, జూన్ 5 (వార్త):** రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయని శక్తి టీం సభ్యులు గిరిధర్, భీమారావు, విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం జలుమూరు మండలం రాయపాడు గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామంలోని గొర్డు అప్పయ్య బండ్ వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులు, గ్రామస్థులకు శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు.

అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలలు శక్తి యాప్ను వినియోగించుకోవడం ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని టెక్కలి డివిజన్-4 హెచ్సీఎం గిరిధర్ వివరించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో పిల్లలు, యువత తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, దీనిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. అలాగే మహిళలు, బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే పోలీసులను లేదా శక్తి యాప్ ద్వారా సమాచారమివ్వాలని సూచించారు.

యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ కానిస్టేబుల్ ధనలక్ష్మి పాల్గొని మహిళల భద్రత, అత్యవసర సేవల వినియోగంపై వివరించారు. గ్రామస్థులు, ఉపాధి హామీ వేతనదారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**జలుమూరు, జూన్ 5 (వార్త):** పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జలుమూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమణమ్మ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జలుమూరు మండలం కరవంజ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణపై మరింత శ్రద్ధ అవసరమని ఆమె అన్నారు. నీటి వనరులను కాపాడుకోవడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యతేనని, నీటిని వృథా చేయకుండా అవసరమైనంత మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు ప్రజలు సహకరించి గ్రామాలను పచ్చదనంతో నింపాలని ఆమె కోరారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొని మొక్కలు నాటారు.

## లయన్స్ రీజినల్ చైర్మన్ రమణ సాహూకు సన్మానం



**నరసన్నపేట, జూన్ 5 (వార్త):** నరసన్నపేట మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు రమణ సాహూ లయన్స్ సంస్థ రీజినల్ చైర్మన్గా ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. అతి చిన్న వయసులోనే ఈ బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నరసన్నపేటలో మిత్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రమణ సాహూను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని వక్తలు కొనియాడారు. లయన్స్ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. యువ నాయకత్వానికి ఇది మంచి గుర్తింపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హర్షవర్ధన్, దాలి నాయుడు తదితరులు పాల్గొని రమణ సాహూకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక యువకులు, క్రీడా సంఘ సభ్యులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్లో ఐదుగురు విద్యార్థుల చేరిక

**- 'బడి పిలుస్తోంది' కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి స్పందన**

**- ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై అవగాహన కల్పించిన అధికారులు**

**జలుమూరు, జూన్ 5 (వార్త):** జలుమూరు మండలం నగిరికటకం ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించడంతో ఐదుగురు చిన్నారులు కొత్తగా చేరినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన 'బడి పిలుస్తోంది' ప్రత్యేక కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ప్రసాదరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబురావు మాట్లాడుతూ, పాఠశాల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, డిజిటల్ బోధన వంటి సౌకర్యాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తుకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు. ఉపాధ్యాయుల బోధనతో పాటు విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి స్పందించిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు రావడం సంతోషకరమని అధికారులు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఇలాంటి ప్రత్యేక డ్రైవ్లు మరింత ఉపయోగ పడతాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచేందుకు భవిష్యత్తులో కూడా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**పలాస, జూన్ 5 (వార్త):** పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు మాధురి ప్రజలను సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలాస కోర్టు ఆవరణలో గౌరవ జూనియర్ సివిల్ న్యాయమూర్తి యు. మాధురి మొక్కలను నాటారు. పలాస బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, సమృద్ధిగా ఆక్సిజన్ అందడానికి కూడా మొక్కలు, వృక్షాలు ప్రకృతికి సహకరిస్తాయని, ప్రతి ఒక్కరూ కూడా మొక్కలను నాటడం, సమరక్షించడము చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పేరా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే పాలన కూటమి ప్రభుత్వ లక్ష్యం



**పలాస, జూన్ 5 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో నిర్వహించిన 'ప్రతి శుక్రవారం ప్రజలతో మన ప్రభుత్వం' కార్యక్రమమని ప్రజలు విజయవంతం చేశారు. గ్రీవెన్స్ డేలో స్వయంగా పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్, ఎమ్మెల్యే గౌతు శిరీష. స్థానిక సమస్యలపై కలెక్టర్కు పెద్దయెత్తున వినతులు సమర్పించిన ప్రజలు; త్వరితగతిన పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ. "నువ్వలరేవు లో జనసందోహం.. 'ప్రజలతో మన ప్రభుత్వం' గ్రీవెన్స్లో స్వయంగా అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్. నువ్వలరేవు వంతెన రోడ్డు పనులు వెంటనే మొదలిపెట్టాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే గౌతు శిరిష మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, సమస్యల తెలియజేసిన వెంటనే నాలుగు వారాల్లో సమస్యలను పరిష్కారం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, కూటమి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయకు ఎంపికైన వివేకానంద విద్యార్థి



**మందస, జూన్ 5(వార్త):** మందస పట్టణంలోని వివేకానంద విద్యానికేతన్ స్కూల్ లో చదువుతున్న గేదెల పార్థనందన్ అనే విద్యార్థి జవహర్ నవోదయకు ఎంపికయ్యాడు. 2026-27 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ ఎంట్రన్స్ టెస్ట్ లో పార్థనందన్(హాల్ టికెట్ నెంబరు.1213049180) ఉత్తీర్ణత సాధించాడు. నవోదయకు ఎంపికైన పార్థనందన్ కు వివేకానంద విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ బోర ఉమాపతి, డైరెక్టర్స్ జె.శంకర్, పి.కోటేశ్వరరావు ఉపాధ్యాయ సిబ్బంది కామేశ్వరరావు, శ్రావణి, హరీష్, త్రివేణి, రామ్మోహన్ అభినందనలు తెలిపారు.

## కాలుష్య నియంత్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత



**ఎల్ఎన్పేట, జూన్ 5(వార్త):** పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి సామాజిక బాధ్యతని, కాలుష్య నియంత్రణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని శుక్రవారం కోవిలాం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించడడం అందరి బాధ్యతని, నీటిని వృధా చేయకుండా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ తెలుగుయువత నాయకులు అంపిలి పోలినాయుడు, పీఏసీయస్ అధ్యక్షులు కాగాన మన్మధరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొవిలాపు క్రిష్ణమాచార్య, మాజీ సర్పంచ్ లు , నాయకులు నడిపిల్లి నారాయణరావు, వెలమల గోవిందరావు, జమ్మిమోహనరావు, చింతాడ శ్రీనివాసరావు, లావేటి మల్లేశ్వరరావు, మండలస్థాయి కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నవచేతన ప్రారంభం

**పలాస, జూన్ 5(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన "నవచేతన" బాల్యారంభ అభివృద్ధి స్క్రీనింగ్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రారంభించారని పలాస ఎంపీడీవో వసంత్ కుమార్ అన్నారు. గురువారం పలాస ఎంపీడీవో కార్యాలయంలో నవచేతన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 0--6 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదల లోపాలను గుర్తించేందుకు ఏఐ ఆధారిత మొబైల్ యాప్ ద్వారా పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. పిల్లల సమగ్ర అభివృద్ధి.. రాష్ట్ర భవిష్యత్తుకు పునాదని తెలిపారు. ప్రతీ పిల్లవాడి సమగ్ర అభివృద్ధి రాష్ట్ర భవిష్యత్తుకు పునాది అనే దృక్పథంతో ముఖ్యమంత్రి బాల్యారంభ సంరక్షణను ప్రభుత్వ ప్రాధాన్యతా అంశంగా గుర్తించారన్నారు. దీనిలో భాగంగా నవచేతన అనేది కార్యక్రమం 0 నుండి 6సంవత్సరాల పిల్లల అభివృద్ధిని ప్రారంభ దశలోనే అంచనా వేయడానికి రూపొందించిన మొబైల్ ఆధారిత డిజిటల్ అభివృద్ధి స్క్రీనింగ్ కార్యక్రమమే నవచేతన అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేయబడుతున్న ఈ కార్యక్రమం అంగన్వాడీ కార్యకర్తలకు శాస్త్రీయ, ప్రమాణీకృత స్క్రీనింగ్ సాధనాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమం ద్వారా ప్రతీ పిల్లవాడి అభివృద్ధి పురోగతిని క్రమబద్ధంగా పరిశీలించి, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన పిల్లలను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చన్నారు. నవచేతన యాప్ ద్వారా పిల్లల అభివృద్ధిని కింది ఐదు ప్రధాన విభాగాలలో అంచనా వేస్తారని, స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి, జ్ఞానాత్మక అభివృద్ధి, సామాజిక--భావోద్వేగ అభివృద్ధి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రెంటికోట వైద్యాధికారి సునీల్, కాశీబుగ్గ ఐసిడిఎస్ పివో కే పార్వతి, అంగన్వాడి సూపర్వైజర్లు లతా, గంగమ్మ పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు**

**ఎల్ఎన్ పేట, జూన్ 5(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బారు కార్యక్రమం నిర్వహిస్తున్నామని పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం నందు ప్రజా దర్బారు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు, ఇళ్లు, రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధిపనులపై చర్చించారు. ప్రజా దర్బార్ లో 55 ధరఖాస్తులు వచ్చాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## స్వర్ణకారుల భవనానికి నిధులు మంజూరు చేయండి



**ఇచ్ఛాపురం, జూన్ 5(వార్త):** రామయ్యపుట్టుగలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం.అశోక్ బాబు కి కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ స్వర్ణ కార సంక్షేమ సంఘం అధ్యక్షులు తొణంగి. శంకర్ ఆచారి మరియు సభ్యులు సంఘ భవనం నిర్మాణం కొరకు నిధులు మంజూరు చెయ్యవలసినదిగా కోరారు. వినతిపత్రాన్ని అందించిన కార్యక్రమంలో ఆశి లీలారాణి, రంగాల శ్రీనివాస్ రెడ్డి, కాయ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ పత్రి తవిటయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



**సారవకోట, జూన్ 5 (వార్త):** ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల బోధన నైపుణ్యాలను మరింత మెరుగుపరచాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రవిబాబు సూచించారు. శుక్రవారం సారవకోట మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, బోధన విధానాలపై సమీక్ష నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ, ఈ శిక్షణా తరగతులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయని, మరో ఐదు రోజుల పాటు కొనసాగనున్నాయని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పఠనం, లెక్కలు, అవగాహన నైపుణ్యాలు పెంపొందించడంలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యా బోధన పట్ల అకుంఠిత దీక్షతో పనిచేసి విద్యార్థుల్లో ప్రాథమిక అభ్యాస సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బోధనలో నూతన పద్ధతులను అనుసరించాలని డీఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, శిక్షణ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**సారవకోట, జూన్ 5 (వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సారవకోట మండలం గుమ్మపాడులో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ మండల శ్రేణులు పాల్గొని ఒక్కొక్కరు ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో మొక్కల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. మొక్కలు సర్వప్రాణులకు జీవనాధారమని, పరిశుభ్రమైన గాలి, వర్షపాతం, జీవ వైవిధ్య పరిరక్షణకు అవి కీలకమని వివరించారు. కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడం కూడా సమాజ బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, కార్యాలయం, గ్రామ పరిసరాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో యువత, విద్యార్థులు ముందుండాలని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే చర్యలు అవసరమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

**సారవకోట, జూన్ 5 (వార్త):** ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మద్దు వెంకటరమణ సూచించారు. శుక్రవారం ఉదయం సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ఆయన తెలిపారు. భోజనం రుచికరంగా, పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లలు సంతృప్తిగా భోజనం చేసే విధంగా వంటలు తయారు చేయడం వంట ఏజెన్సీల బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రత అత్యంత ముఖ్యమని, వంటశాలలు, పాత్రలు, తాగునీటి విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతపై పాఠశాల ఉపాధ్యాయులు కూడా పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ సభ్యులు పాల్గొన్నారు.



# పిల్లల సమగ్రాభివృద్ధికి నవచేతన యాప్

**నరసన్నపేట, జూన్ 5 (వార్త):** పిల్లల ఆరోగ్యం, పోషణ, అభివృద్ధి అంశాలను సమగ్రంగా నమోదు చేసి పర్యవేక్షించేందుకు ప్రభుత్వం 'నవచేతన' యాప్‌ను ప్రవేశపెట్టిందని ఐసీడీఎస్ పీవో శోభారాణి తెలిపారు. శుక్రవారం నరసన్నపేట బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 0 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లల ఆరోగ్య, పోషకాహార, అభివృద్ధి వివరాలను యాప్‌లో నమోదు చేయడం ద్వారా వారి ఎదుగుదలను సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని తెలిపారు. చిన్నారుల్లో పోషకాహార లోపం, ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామస్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, పిల్లల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతాయని చెప్పారు. శిక్షణా తరగతుల్లో యాప్ వినియోగ విధానం, డేటా నమోదు, పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అవసరమని, పిల్లల పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు ప్రత్యూష, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.




# నరసన్నపేటలో పారిశుధ్యం అస్తవ్యస్తం



**- వీధుల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు**

**- శుభ్రతా చర్యలు చేపట్టాలని**

**పట్టణవాసుల విజ్ఞప్తి**

**నరసన్నపేట, జూన్ 5 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా కొరవడిందనే ఆరోపణలు స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మే 16న ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పట్టణ పరిసరాలను ప్రత్యేకంగా శుభ్రం చేసిన అధికారులు, ప్రస్తుతం పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేస్తున్నారని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో పలుచోట్ల చెత్త పేరుకుపోతోందని ప్రజలు చెబుతున్నారు. ప్రధాన వీధులు, కాలనీలు, రహదారుల పక్కన చెత్త కుప్పలు కనిపిస్తుండటంతో దుర్వాసన వ్యాపిస్తోందని వాపోతున్నారు. చెత్త తొలగింపులో జాప్యం కారణంగా దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అనారోగ్య భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. సీఎం పర్యటన సమయంలో మాత్రమే ప్రత్యేక శ్రద్ధ చూపి, అనంతరం పరిస్థితిని పట్టించుకోకపోవడం సరైన విధానం కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పట్టణంలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చెత్త పేరుకుపోవడం వల్ల అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, అధికారులు వెంటనే స్పందించి శుభ్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇంటింటా చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నత్తనడకన ఏరియా ఆస్పత్రి ప్రహరీ నిర్మాణం

**- అసంపూర్తి పనులతో భద్రతపై ఆందోళన**

**-గోడ పూర్తి చేయాలని సిబ్బంది, ప్రజల విజ్ఞప్తి**

**నరసన్నపేట, జూన్ 5 (వార్త):** నరసన్నపేట ఏరియా ఆస్పత్రి ప్రహరీ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో ఆస్పత్రి భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రి పరిసర ప్రాంతాలకు రక్షణ కల్పించే ఉద్దేశంతో గతంలో ప్రహరీ గోడ నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ, పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ప్రస్తుతం ప్రహరీ గోడ పూర్తిగా లేకపోవడంతో ఆస్పత్రి ప్రాంగణంలోకి పలు వైపుల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. వేర్వేరు మార్గాల గుండా అనధికారికంగా ప్రవేశాలు జరుగుతుండటంతో భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు, వైద్య సిబ్బందికి ఇబ్బందులు కలుగుతున్నాయని, రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని స్థానికులు అంటున్నారు. ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రత నిర్వహణకూ ఈ పరిస్థితి ఆటంకంగా మారుతోందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీ గోడ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆస్పత్రి సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు. ఆస్పత్రి భద్రత, రోగుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.



# మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



**జలుమూరు, జూన్ 5(వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసన్నపేట మండలం తామరాపల్లి గురుకుల పాఠశాలలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మరియు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో చెట్ల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం కొన్ని మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన వివరించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విద్యుత్ ద్విచక్ర వాహనాల ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పర్యావరణ హిత రవాణా వ్యవస్థలను ప్రోత్సహించే ఉద్దేశంతో చేపట్టిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యుత్ వాహనాల వినియోగం ద్వారా ఇంధన వ్యయాన్ని తగ్గించడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించవచ్చని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మొక్కలు నాటడం.. పర్యావరణానికి మేలు

**పలాస, జూన్ 5 (వార్త):** ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం బాధ్యతగా గుర్తించాలని జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు పాలవలస వైకుంఠరావు అన్నారు. గురువారం ప్రపంచ పరిరక్షణ పర్యావరణ దినోత్సవ సందర్భంగా అమ్మ ఆశ్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజులకు, ప్రత్యేక రోజులకు మొక్కలు నాటాలని కోరారు.తమకు చెందిన ఖాళీ స్థలాలతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, నాటిన ప్రతీ మొక్క ఎదిగేంతవరకు బాధ్యత వహించాలని, భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించేందుకు మొక్కలు నాటి, వాటిని పెంచి కాపాడాలి "మొక్కలు పర్యావరణాన్ని రక్షిస్తే, అది మనల్ని కాపాడుతుంది" అని అన్నారు. అమ్మ ఆశ్రమంలో గల వృద్ధాప్య హోమ్ కాలీ జాగాలో మొక్క నాటడం ఆ మొక్క పెరుగుదలకు ఐరన్ గార్డ్ వేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పలాస నియోజకవర్గ పూర్వ కన్వీనర్ రామానంద స్వామి జీ, ఎస్సి మోర్చా టౌన్ అధ్యక్షులు గోంటి అప్పారావు, మణికంఠ, నాగభూషణం, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీఅధ్యక్షులు పొట్నూరు తారకేశ్వరరావు పాల్గొన్నారు.



# సూపర్ సిక్స్ బాండ్లు, టీడీపీ మేనిఫెస్టో దహనం

**జలుమూరు, జూన్ 5(వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సారవకోట మండల కేంద్రం ప్రధాన రహదారిపై, జలుమూరు మండలం చల్లపేట జంక్షన్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు ప్రజలకు అందజేసిన సూపర్ సిక్స్ బాండ్ల ప్రతులు, టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో పత్రాలను రోడ్డుపైనే దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాల పేరుతో ప్రజలను ఆకర్షించి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. రెండేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 12వ తేదీ వరకు దశలవారీగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, మండల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల అనుబంధ విభాగాల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చంద్రబాబు హయాంలో డ్వాక్రా విప్లవం



**నరసన్నపేట, జూన్ 5 (వార్త):** నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైందని, మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశేష ప్రాధాన్యత ఇస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మహిళా సంఘాల ఆర్థిక వ్యవస్థను మరింత పారదర్శకంగా, సాంకేతికతతో అనుసంధానించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన "మన డబ్బులు – మన లెక్కలు" మొబైల్ అప్లికేషన్ మహిళలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. శుక్రవారం నరసన్నపేట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన "మన డబ్బులు – మన లెక్కలు" మొబైల్ అప్లికేషన్ అవగాహన సదస్సులో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళా సంఘాల బలోపేతానికి చంద్రబాబు నాయుడు సుదీర్ఘకాలంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. గతంలో డ్వాక్రా సంఘాల లావాదేవీల నిర్వహణలో పుస్తకాల నమోదు, వడ్డీ లెక్కలు, పొదుపు ఖాతాల నిర్వహణలో చిన్నపాటి పొరపాట్లు లేదా అవకతవకలకు అవకాశం ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ డిజిటల్ యాప్ ద్వారా ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ యాప్ వినియోగంతో ప్రతి గ్రూపు సభ్యురాలు చేసిన పొదుపు, తీసుకున్న రుణం, చెల్లించిన వడ్డీ వంటి వివరాలు ఎప్పటికప్పుడు డిజిటల్ రూపంలో నమోదవుతాయని తెలిపారు. దీంతో మానవ తప్పిదాలు, నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పారదర్శకత పెరుగుతుందని అన్నారు. "మన డబ్బులు – మన లెక్కలు" యాప్ ప్రతి రూపాయికి జవాబుదారీతనాన్ని తీసుకువస్తూ మహిళా సంఘాల మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బగ్గు అర్చన మాట్లాడుతూ, మహిళ ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. డ్వాక్రా వ్యవస్థకు పునాది వేసిన నాయకుడు చంద్రబాబేనని, ఇప్పుడు సాంకేతికతను జోడించి మహిళా సంఘాలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా సమాఖ్య అధ్యక్షురాళ్లు, కార్యదర్శులు, వీఓఏలు, స్థానిక ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకిచ్చిన హామీలన్నింటికీ కూటమి ప్రభుత్వం తూట్లు

**- పలాస-కాశీబుగ్గలో విజయవంతంగా**

**"వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన**

**- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు**



**పలాస, జూన్ 5 (వార్త):** రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైన ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలాస మండలం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శ్రీనివాసరాజు జంక్షన్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, రెండేళ్లలో రాష్ట్ర ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. 50 ఏళ్లు దాటిన బీసీలకు పెన్షన్, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల భృతి, రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు, మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఆడబిడ్డ నిధి అందజేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం వాటిలో ఒక్కదానినైనా పూర్తిస్థాయిలో అమలు చేసిందా అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక, మట్టి, ఖనిజ మాఫియాలు విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులు, ప్రాజెక్టులు, సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో అమ్మకానికి పెడుతూ రాష్ట్ర సంపదను కొందరి చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. అమరావతి పేరుతో రాష్ట్ర సంపదను ఒకే ప్రాంతానికి తరలిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు.

పలాస నియోజకవర్గంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని, మద్యం దుకాణాలు, బెల్ట్ షాపుల ద్వారా ప్రతి మద్యం బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచే వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మద్యం దుకాణాల్లో ప్రతిరోజూ వేలాది బాటిళ్లు అమ్ముడవుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి భారీ మొత్తంలో అదనపు వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అంశంపై గతంలో కూడా తాము పోరాటం చేశామని, ప్రజల తరఫున ప్రశ్నించినందుకు తనపై కేసులు కూడా నమోదు చేశారని గుర్తు చేశారు. ప్రజల కష్టార్జిత ధనాన్ని దోచుకుంటున్న ఈ వసూళ్లపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీ నాయకులపై ఉందన్నారు. "ఇవి అక్రమ వసూళ్లు కాదు... అక్క వసూళ్లు" అంటూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందని, ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు శిస్టు గోపీ, మండల అధ్యక్షుడు దువ్వాడ రవి, వైసిపి అధికార ప్రతినిధి బండి దుర్యోధన, ఉంగ సాయి కృష్ణ, పైల వెంకటరమణ (చిట్టి), పలాస మండలం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇచ్ఛాపురంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**ఇచ్ఛాపురం, జూన్ 5 (వార్త):** ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గాంధీ పార్క్ లో కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ మాట్లాడు కొనసూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరు పుట్టినరోజు,వివాహ దినోత్సవ, వివిధ వేడుకల సందర్భాలలో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ , స్వచ్ఛంద సంస్థలు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్వర్ణ వార్డు సిబ్బంది పాల్గొన్నారు.

### చెట్ల నాటకం -- స్వచ్ఛ భారత్ కార్యక్రమం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో మేరా యువ భారత్, నెహ్రూ యువ కేంద్ర శ్రీకాకుళం ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం మరియు చెట్ల నాటకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన రహదారిపై పరిశుభ్రత కార్యక్రమం చేపట్టి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మొక్కలు నాటారు. యువ సామాజిక సేవకుడు హంగీర్ బెహరా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌ల్యాండ్ ఫిషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు గయ రామచంద్ర బెహరా, సోమేష్, సదానంద్, పార్వతి, చిన్నకుమారి, సత్యభామతో పాటు మత్స్యకార గ్రామస్తులు, మహిళలు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి లో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెంట్ దేవేందర్ రెడ్డి సారథ్యంలో హాస్పిటల్ పరిసరాల్లో మొక్కలు నాటడం జరిగింది .ఈ సందర్భంగా వృక్షో రక్షతి రక్షితః". దీని అర్థం "మనం చెట్లను కాపాడితే, ఆ చెట్లు మనల్ని కాపాడతాయి". పర్యావరణ పరిరక్షణకు, మానవ మనుగడకు ఇది ఎంతో ప్రాముఖ్యమైన పాత్ర వహిస్తుందని ఈ సందర్భంగా చెప్పారు. పర్యావరణం బాగుండాలి అంటే మన చుట్టూ ఉన్న పరిసరాలు అంతా పచ్చదనంగా ఉండాలని, పచ్చదనంగా ఉండాలంటే మనిషి తన జీవితంలో కనీసం 10 మొక్కలు నాటాలని తద్వారా వాతావరణం చల్లగా ఉంటుందని తద్వారా జంతు జీవాలు సుభిక్షంగా ఉంటాయన్నారు . సకాలంలో వర్షాలు పడతాయని వేడి ఎండలు తాకిడి లేకుండా ఆరోగ్య సమాజాన్ని నిర్మించి వచ్చని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రసూతి గర్భిణీ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సనపల అనూష, నీలిమ,



ఎన్ సి డి సెల్లు విభాగం డాక్టర్ శ్వేతా పండా మరియు వైద్య బృందం హెడ్నర్స్ స్టాఫ్ సానిటరీ విభాగం మొదలగు వారంతా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

## చిన్నారులను సొంత బిడ్డల్లా చూడాలి



**సోంపేట, జూన్ 5 (వార్త):** అంగన్వాడి కేంద్రాల పరిధిలో ఆరేళ్లలోపు చిన్నారులను కార్యకర్తలు తమ సొంత బిడ్డల్లా చూసుకోవాలని సోంపేట సిడిపిఓ కే వసుంధర దేవి పేర్కొన్నారు. కంచిలి మండలానికి సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తలకు శుక్రవారం సోంపేట బాలిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆరేళ్లలోపు చిన్నారుల శారీరిక మానసిక అభివృద్ధిని తప్పనిసరిగా గమనించాల్సిన అవసరం ఉందని అన్నారు. వారి ఆహారం,పెరుగుదల,బరువు, సాధారణ వ్యాధులు, అసాధారణ వ్యాధులను కార్యకర్తలు గుర్తించి ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన నవచేతన యాప్ లో నమోదు చేయాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగంగా పిల్లల చిన్న వయసు నుంచే వారి ఆరోగ్య పరిస్థితులు ఇతరత్రా అంశాలు క్షుణ్ణంగా గమనించాలని కోరారు. ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అంగన్వాడీ కార్యకర్త సొంత అమ్మలా వ్యవహరించి అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాడుపూడి కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ వాణికుమారి, సూపర్వైజర్లు లక్ష్మి, ధనలక్ష్మి, ఈశ్వరి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో అవసరం



**మందస, జూన్ 5(వార్త):** ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో అవసరమని మందస మండల విద్యాశాఖాధికారి మద్రిపాటి లక్ష్మణరావు అన్నారు. పలాస డివిజనల్ లెవెల్ ఉపాధ్యాయ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డివిజనల్ లెవెల్ లో జరిగే ఉపాధ్యాయ ఎఫ్ఎల్ఎన్ ఆరు రోజుల శిక్షణా శిబిరాన్ని సందర్శించి, ఉపాధ్యాయులకు ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమం అనేది ఒకటి, రెండు తరగతుల చదువుతున్న పిల్లలకు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ అనేది ఉపాధ్యాయులకు ఒక వరం లాంటిదని అన్నారు. బాల్య దశలో పాఠశాలకు వచ్చిన ఒకటవ తరగతి పిల్లవానికి మీరు నేర్పించే అక్షరాభ్యాసము సరస్వతీ కటాక్షంగా చిరస్థాయిలో వారు ఉన్నత శిఖరాలకు ఎదిగినా సరే.. మీరు నేర్పించే ఆ అక్షరాభ్యాస నడవడిక అనేది గుర్తుండి పోయేలా ప్రతీ ఉపాధ్యాయుడు తన వంతు బాధ్యత తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు అందించగలిగితే అది ఒక దేవుడు ఇచ్చిన వరం లాంటిదని వారు గుర్తుంచుకుంటారన్నారు. పాఠశాలకు వచ్చిన ఒకటవ తరగతి పిల్లలు మట్టి ముద్దవలె ఉంటారని, వారిని కుమ్మరివాడు మట్టి ముద్దను ఏ విధంగా తీర్చిదిద్దితే అలంకారప్రాయమైనటువంటి ఆకృతాలు తయారవుతాయో ఆ విధంగా మనకి వచ్చే ఒకటో తరగతి పిల్లలను కూడా మనం తయారు చేసే విజ్ఞాన సంపాదికులు తయారువచ్చని తెలిపారు.

## పిల్లల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలి



**మెళియాపుట్టి, జూన్ 5(వార్త):** పిల్లల సమగ్ర ఆభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని చింతాడ ఇందిరా అన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారంనాడు నవచేతన 5, 6 తేదీల్లో జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ పిల్లవాడి సమగ్ర అభివృద్ధి రాష్ట్ర భవిష్యత్తుకు పునాది అనే దృక్పథంతో ముఖ్యమంత్రి బాల్యారంభ సంరక్షణను ప్రభుత్వ ప్రాధాన్యతా అంశంగా గుర్తించారన్నారు. దీనిలో భాగంగా నవచేతన అనే కార్యక్రమం ద్వారా 0 నుండి 6 సంవత్సరాల పిల్లల అభివృద్ధిని ప్రారంభ దశలోనే అంచనా వేయడానికి రూపొందించిన మొబైల్ ఆధారిత డిజిటల్ అభివృద్ధి స్క్రీనింగ్ కార్యక్రమమే నవచేతన అన్నారు. ఈ కార్యక్రమం అంగన్‌వాడీ కార్యకర్తలకు శాస్త్రీయ, ప్రమాణీకృత స్క్రీనింగ్ సాధనాన్ని అందిస్తుందన్నారు. నవచేతన యాప్ ద్వారా పిల్లల అభివృద్ధిని కింది ఐదు ప్రధాన విభాగాలలో అంచనా వేస్తారని, స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి, జ్ఞానాత్మక, సామాజిక అభివృద్ధి తదితర అంశాలను మాట్లాడారు. కార్యక్రమంలో మెళియాపుట్టి పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ కె.ప్రశాంత్, సూపర్వైజర్ అమరావతి, యాక్టివ్ సూపర్వైజర్ సుజాత, రేణుక, గీత, కళావతి, నారాయణమ్మ, సులోచన, లోలాక్షి, మెళియాపుట్టి, పెద్దపద్మాపురం అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెన్నుపోటు చంద్రబాబు డౌన్ డౌన్

**సంతబొమ్మాళి, జూన్ 5(వార్త):** ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రెండేళ్లుగా ప్రజలను మోసగించిన వెన్నుపోటు చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ వైఎస్ఆర్సిపి నాయకులు నినాదాలు చేశారు. మండల కేంద్రం సంతబొమ్మాళి బస్టాండ్ కూడలి వద్ద చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వెన్నుపోటు చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా వస్తున్న వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. రోప్ సహాయంతో ర్యాలీ ముందుకు వెళ్లకుండా పోలీసులు ప్రయత్నించగా వైఎస్ఆర్సిపి శ్రేణులు తోసుకుంటూ ముందుకు సాగారు. చంద్రబాబు రాక్షస పాలన నశించాలని....పోలీసులు దౌర్జన్యం నశించాలంటూ ర్యాలీని ముందుకు సాగి స్థానిక బస్టాండ్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను, టిడిపి మేనిఫెస్టో కాపీలను చించి వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పిటిసి పాల వసంత రెడ్డి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పి.రవికుమార్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బి. మోహన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు నక్క భీమారావు, మార్పు నాగభూషణరావు, సురాడ రాజారావు, అంగ మల్లేష్, దుక్క భూషణ్ రెడ్డి , మార్పు అశోక్ చక్రవర్తి, శ్రీరంగం వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL/2023/87546